(సమగ్ర తెలుగు దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDICA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 3 సంచిక : 150 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 17-08 - 2025 పేజీలు : 6

Digital Edition



## భారీ వర్షాలు.. 257 మంది మృతి

హైదరాబాద్ :

హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. క్లౌడ్‌బరస్ట్, ఆకస్మిక వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ ఏడాది జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం.. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 257 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాలు.. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్‌లు, ఇళ్లు కూలిపోవడం, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా 133 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల్లో 124 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఎప్పటికప్పుడు జలాశయాలను అధికారులు పరిశీలిస్తూ ఉండాలి: రేవంత్

వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉంచాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్ డిఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సిఎం మాట్లాడారు.



హైదరాబాద్:

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సూచించారు. జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలని రేవంత్ తెలియజేశారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, నగర, పురపాలక, గ్రామాల పరిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు తగినన్ని ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులతో చెప్పారు. హైదరాబాద్ లో ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని, జిహెచ్‌ఎంసి, హైడ్రా, ఎస్డిఆర్‌ఎఫ్, అగ్ని మాపకశాఖ తక్షణమే స్పందించాలని రేవంత్ రెడ్డి కోరారు.

## పోలవరంను.. కూలవరం అనే ధైర్యం ఉందా



•కెటిఆర్

ఆంధ్రప్రదేశ్ లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ కుంగిపోవడంపై కాంగ్రెస్, బిజెపికి మాట్లాడే ధైర్యం ఉందా అంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫైరయ్యారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. జాతీయ హోదా ఇచ్చి, ఎన్డీఏ ప్రభుత్వమే నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టులో కాపర్ డ్యాం కుంగిపోయి, కొట్టుకుపోయినా చీఋూకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. అదే కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే.. కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బిజెపి నేతలకు పోలవరంను.. 2లో




## 'సాగు' లక్ష్యం.. నెరవేరుతోంది

- తెల్ల బంగారానికి ఊపిరి..
- వర్షాలతో పలు ప్రాజెక్ట్‌లకు జలకళ వచ్చింది
- రోహిణి కార్తెతోనే రుతుపవనాల ఆగమనంతో వానాకాలం రైతులను ముందస్తుగా మురిపించింది
- వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో మళ్లీ పంటలపై భరోసా పెరిగిందిపించింది

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రాజన్న సిరిసిల్ల జిల్లా అన్నదాతల ఆశలకు ఊపిరినిస్తున్నాయి. వ్యవసాయ శాఖ వానాకాలం సీజన్ పంటల సాగు అంచనా లక్ష్యం నెరవేరుతోంది. ఇప్పటికే అంచనాకు మించి రైతులు వరి నాట్లు వేసుకున్నారు. రోహిణి కార్తెతోనే రుతుపవనాల ఆగమనంతో వానాకాలం రైతులను ముందస్తుగా మురిపించింది. ఆ తర్వాత మోస్తారుతో పాటు చిరుజల్లులే కురిశాయి. దీంతో రైతులు ఎన్నోఆశలతో వానాకాలం సాగు పనులు ప్రారంభించారు. ఆశించిన వర్షాలు లేకపోవడంతో సాగుపై తీవ్రప్రభావం పడింది. అల్పపీడిన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో మళ్లీ పంటలపై భరోసా పెరిగింది. వరి, పత్తి ఇతర పంటల సాగు పెరిగింది. జిల్లాలో వానాకాలంలోలో 2,43,773 ఎకరాలు వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్ రూపొందించింది. -2లో



## బనకచర్ల కోసమే కాళేశ్వరం లేదంటున్న సిఎం: జగదీశ్‌రెడ్డి

స్వాతంత్ర్య దినోత్సవం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు ఆయన గురువు, ఎపి సిఎం చంద్రబాబు ప్రసంగానికి కొసాగింపుగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎంఎల్ఎ గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గోదావరిలో నీళ్లు లేవని చెప్పకుండా, కాళేశ్వరం లేదని చెప్పడం అంటే కేవలం బనకచర్లకు మద్దతు ప్రకటించడమేనని అన్నారు. కాళేశ్వరం నుంచి 240 టిఎంసిలకు పైగా నీళ్లను వాడుతున్నామని చెప్పలేదంటే బనకచర్లకు అనుమతిస్తున్నట్లే అని స్పష్టమవుతోందని అన్నారు. -2లో

## అప్పుడు ట్రంప్ ఉంటే యుద్ధం జరిగేది కాదు పుతిన్

ఉక్రెయిన్ యుద్ధంపై చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అలాస్కాలో జరిగి సమావేశం ముగిసింది. అలాస్కాలో రెడ్ కార్పెట్ లో పుతిన్ అమెరికా అధ్యకుడు ట్రంప్ ఘన స్వాగతం పలికారు. 3లో



## పాకిస్థాన్‌లో వరదలు.. 320 మంది మృతి

వివరాలు 3లో..

## కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..?



తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్‌డిఎస్‌ఎకు కనిపించడం లేదా..? అని అడిగారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్ -బిజెపి నేతలకు పోలవరంను.. కూలవరం అనే దమ్ము ధైర్యం ఉందా..? అని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్‌డిఎస్‌ఎను దించి బిఆర్‌ఎస్‌పై బురదజల్లిన బిజెపి నేతలు..

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

### మంత్రి తుమ్మల



జూబ్లీహిల్స్‌లోని పలు కాలనీల్లో అన్ని వసతులు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఉప ఎన్నికల్లో గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉప ఎన్నిక ప్రచారం లో భాగంగా మంత్రి తుమ్మల పార్టీ కార్యకర్తలను ఉదేశించి శనివారం మాట్లాడారు. -2లో



## యాదగిరిగుట్టలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

2లో

నారసింహుడి నిత్యరాబడి రూ.50.84 లక్షలు



## రుణ గ్రహీతలపై ఎస్‌బిఐ పిడుగు




దేశ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) గృహరుణ దాతలకు పిడుగు లాంటి వార్త చెప్పింది. గృహరుణాలపై వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు మేర పెంచింది. తక్కువ సిబిల్ స్కోరు ఉండేవారికి ఇకపై అధిక వడ్డీరేట్లకు హోమ్ లోన్‌ను ఎస్‌బిఐ అందించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో ఎస్‌బీఐ మార్పులు చేసింది. -2లో

# 'సాగు' లక్ష్యం.. నెరవేరుతోంది

సీజన్ ప్రారంభంలో కొత్త ఇబ్బంది పడ్డా ప్రస్తుతం లక్ష్యం చివరి దశకు చేరుకుంది. జిల్లాలో ఇప్పటివరకు 2,36,305 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి, పత్తితో పాటు మొక్కజొన్న 3,713 ఎకరాలు, కందులు 660 ఎకరాలు, పెసర 30 ఎకరాలు, ఇతర పంటలు 77 ఎకరాల్లో సాగు చేశారు. చివరికి ఆశలు...దజిల్లాలో వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక వరినాట్లు మందకొడిగా సాగాయి. రైతులు కూడా నారుమడులు సిద్ధం చేసుకున్న నాట్లు వేసుకోలేక ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత అల్పపీడనంతో కురిసిన వర్షాలు వరిసాగుపై ఆశలు పెంచాయి. వ్యవసాయ శాఖ అంచనాకు మించి వరిసాగు చేశారు. జిల్లాలో 1,84,860 ఎకరాల్లో వరి సాగు అంచనా ఉండగా ఇప్పటికే 1,85,560 ఎకరాలు సాగు చేశారు. వర్షాలు కురుస్తుండడంతో పంటలకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. తెల్ల బంగారానికి ఊపిరి.. వర్షాకాలం ప్రారంభంలోనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని భావించి పత్తి రైతులు ముందస్తుగా విత్తనాలు వేసుకున్నారు. ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో మొక్కలు వాడిపోయే దశకు చేరుకున్నాయి. రైతులు ఆవేదన చెందుతుండగా అల్పపీడనంతో వర్షాలు పడుతుండడంతో తెల్ల బంగారంగా భావించే పత్తి పంటకు ఊపిరినిస్తున్నాయి. జిల్లాలో 49,760 ఎకరాల్లో పత్తి సాగు అంచనాలకు గాను ఇప్పటి వరకు 46,205 ఎకరాల్లో సాగు చేశారు. రైతులు కలుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ప్రాజెక్ట్‌లకు జలకళ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పలు ప్రాజెక్ట్‌లకు జలకళ వచ్చింది. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు మోస్తారుగా వర్షం కురిసింది. శనివారం ఉదయం వరకు సగటు వర్షపాతం 16.0 మిల్లీమీటర్లు నమోదయింది. శనివారం మధ్యాహ్నం వరకు వర్షం పడింది. మళ్లీ పొడి వాతావరణమే ఏర్పడింది. జిల్లాలో రుద్రంగి, చందుర్తి మండలంలో 18.3 మిల్లీమీటర్లు, వేములవాడలో 17.8 మిల్లీమీటర్లు, బోయిన్‌పల్లిలో 15.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 15.3 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంటలో 15.0 మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 13.5, సిరిసిల్లలో 12.5 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 11.5 మిల్లీమీటర్లు, వేములవాడ రూరల్‌లో 9.5 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 8.8, తంగళ్లపల్లిలో 8.0 మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 7.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దీనికి తోడుగా సిరిసిల్ల మానేరు, వేములవాడ మూల వాగుల నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.55 టీఎంసీలు ఉండగా 9.718 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా 12,000 క్యూసెక్కుల నీరు చేరుతోంది. మానేరు మూల వాగుల నుంచి 9,450 క్యూసెక్కుల నీరు వస్తోంది. అన్నపూర్ణ ప్రాజెక్టులోకి 30 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. 3.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 1.34టీఎంసీల నీరు ఉంది. ఎగువ మానేరు ప్రాజెక్టులో 2.0 టీఎంసీలకు గాను 1.34 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 925 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

# యాదగిరిగుట్టలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**-నారసింహుడి నిత్యరాబడి రూ.50.84 లక్షలు**

యాదగిరిగుట్ట :
తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వరుస సెలవులు రావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివస్తుండడంతో యాదగిరిగుట్టలో సందడిగా మారింది. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా శనివారం రూ.50,84,453 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,57,100, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,44,600, వీఐపీ దర్శనం ద్వారా రూ.9,00,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,42,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,18,816, ప్రసాద విక్రయం ద్వారా రూ.16,22,570, కల్యాణకట్ట ద్వారా రూ.1,05,100తో పాటు వివిధ శాఖ, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు ..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని దేవస్థానం గోశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది, గోశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవారి సేవలో ప్రముఖులు..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజనీష్‌గుప్తా, తెలంగాణ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా వేర్వేరుగా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి: మంత్రి తుమ్మల

జూబ్లీహిల్స్‌లోని పలు కాలనీల్లో అన్ని వసతులు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఉప ఎన్నికల్లో గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉప ఎన్నిక ప్రచారం లో భాగంగా మంత్రి తుమ్మల పార్టీ కార్యకర్తలను ఉదేశించి శనివారం మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ విజయం సాధించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరానికి ఎన్నో అవకాశాలు వచ్చాయి,మాదాపూర్,హైటెక్ సిటీ రోజు రోజుకు అభివృద్ధి చెందుతోందని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఉన్న స్లమ్ ఏరియాలు అభివృద్ధి చెందాలి అంటే కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలని, తమది మాటల ప్రభుత్వం కాదని చేత ప్రభుత్వమని స్పష్టం చేశారు. గతంలో 10 సంవత్సరాలుగా పరిపాలించిన పార్టీ ఏమి చేయాలేదని విమర్శించారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని, స్కాంలు, ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడడం సరికాదని అన్నారు. నేతలంతా కలిసి ఐక్యంగా పని చేయాలి, బూత్ స్థాయి నుండి కోఆర్డినేట్ చేసుకొని ప్రతి వంద ఓట్ల వివరాలు మన వద్ద ఉండాలని అన్నారు .ప్రతి బూత్ లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ రావాలి ఆయన వెల్లడించారు . కాంగ్రెస్ ప్రభు-త్వాన్ని బలోపేతం చేయండి, తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని అన్నారు. మన పిల్లలు మనమంతా సుఖ సంతోషాలతో బతకాలి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకొని మనకు పట్టం కట్టారని తెలిపారు . జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా మద్దతు తెలిపి ఆహ్వానించాలని అన్నారు. కారక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, కార్పొరేషన్ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుణ గ్రహీతలపై ఎస్‌బిఐ పిడుగు

దేశ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) గృహరుణ దాతలకు పిడుగు లాంటి వార్త చెప్పింది. గృహరుణాలపై వడ్డీ రేట్లను 25 బేసిసి పాయింట్లు మేర పెంచింది. తక్కువ సిబిల్ స్కోరు ఉండేవారికి ఇకపై అధిక వడ్డీరేట్లకు హోమ్ లోన్‌ను ఎస్‌బిఐ అందించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో ఎస్‌బీఐ మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచామని, అయితే, ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమేనని, ఇప్పటికే తీసుకున్న గృహ రుణాలకు ఇది వర్తించదని విశ్వసనీయ సమాచారా వర్గాలు వెల్లడించగా, దీనిపై ఎస్‌బిఐ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే గృహరుణాలపై వడ్డీ రేట్లను 25 బేసిసి పాయింట్లు మేర పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో నూతన వడ్డీరేట్లు కొత్త రుణ గ్రహీతలకు వర్తిస్తుందని, ఈ వడ్డీరేట్లు ఆగస్టు 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు ఎస్‌బిఐ ప్రకటించింది.అయితే కాల వ్యవధి ఆధారంగా ఈ గృహ రుణాల వడ్డీరేట్లలో వ్యత్యాసం ఉండగా, ఈ రేట్ల గరిష్ఠ పరిమితిని ఇప్పుడు ఎస్‌బిఐ పెంచేసింది. ఇప్పటివరకు ఈ బ్యాంకులో గృహ రుణల రేట్లు 7.50 శాతం నుంచి 8.45 శాతంగా ఉండగా తాజా నిర్ణయంతో ఇది 7.50 శాతం నుంచి 8.70 శాతానికి చేరుకుంది. మరోవైపు ఇటీవల విడుదల చేసిన త్రైమాసిక ఫలితాల్లో మార్కెట్ అంచనాలు మించి ఎస్‌బీఐ సత్తాచాటింది. 2025-, 26 ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి మూడు నెలలకు గానూ రూ.19,160 కోట్ల నికర లాభాన్ని సంపాదించింది. గతేడాది నమోదైన రూ.17,035 కోట్ల నికర లాభంతో పోలిస్తే 12 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.1,35,342 కోట్లుగా నమోదు కాగా, గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,22,688 కోట్లుగా ఉంది. తాజాగా ఎస్‌బిఐ సిబిల్ స్కోర్ తక్కువ ఉన్నవారికి సైతం రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంతో ఎస్‌బిఐ మరింత లాభపడనుందని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.ఇక మరో ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తమ గృహరుణాలపై వడ్డీరేట్లను సవరించింది. గతంలో 7.35 శాతం ఉండగా తాజాగా దాన్ని 10 బేసిస్ పాయింట్లు పెంచి 7.45 శాతానికి చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుగా తక్కువ వడ్డీరేట్లకే గృహ రుణాలు ఇస్తున్న ఎస్‌బిఐ వడ్డీరేట్ల సవరింపు నిర్ణయంతో మిగతా ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచే అవకాశం కనిపిస్తోంది.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..?

కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్ పై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.ఏకంగా 10 అడుగుల వెడల్పు.. 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఎపిలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్‌కు దిక్కులేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర?త్వమే అని మండిపడ్డారు. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఊలుకూ లేదు, పలుకూ లేదని విమర్శించారు. మరోసారి ఎపిలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, ఇటు తెలంగాణలో ఎస్.ఎల్.బి.సి. టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్.డి.ఎస్.ఎ అడ్రస్ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంజాబ్ నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతును తీర్చిదిద్దిన కెసిఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బిజెపి పార్టీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం.. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటామని కెటిఆర్ స్పష్టం చేశారు.

## పోలవరంను.. కూలవరం అనే ధైర్యం ఉందా?: కెటిఆర్

కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బిజెపి నేతలకు పోలవరంను.. కూలవరం అనే దమ్ము ధైర్యం ఉందా? అని నిలదీశారు. "అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే %చీఐూా% ను దించి బిఆర్‌ఎస్ పై బురజల్లిన బిజెపి నేతలు.. కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్ పై ఎందుకు మౌనంగా ఉన్నారు?. తెలంగాణకు వరప్రదాయిన అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరంకు మరో నీతా?. ఏకంగా 10 అడుగుల వెడల్పు, 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యాంను గుట్టుచప్పుడు కాకుండా ఎపిలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తున్నారు. అదే తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్ పోయలేదు. దీనికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర?త్వమే" అని కెటిఆర్ మండిపడ్డారు.

# బనకచర్ల కోసమే కాళేశ్వరం లేదంటున్న సిఎం: జగదీశ్‌రెడ్డి

వాస్తవంగా గోదావరిలో మిగులు నీళ్లు లేవని, పక్క రాష్ట్రంలో కట్టే ప్రాజెక్టులకు నిరాకరించాలని, కానీ రేవంత్ మాత్రం చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఇక్కడ చదివి వినిపించారని అన్నారు. బనకచర్లకు అనుమతులు రావాలంటే కాళేశ్వరంను రికార్డులో నుంచి మాయం చేయాలనే కుట్ర జరుగుతోందని, చంద్రబాబు కుట్రలో భాగంగానే ఇక్కడ రేవంత్ రెడ్డి మాట్లాడారని అన్నారు. కాళేశ్వరంపై ఉన్న నంది మేడారం, కన్నెపల్లి, గాయత్రి పంప్‌హౌస్‌లను ప్రారంభించారంటే కాళేశ్వరం ప్రాజెక్టు అంతా బాగున్నట్లే అన్నారు. కాళేశ్వరం ద్వారా గత ఎనిమిది పంటలకు నీళ్లు ఇచ్చినట్లుగానే ఈ ప్రభుత్వం ఆయకట్టు ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. ఇక్కడి మంత్రి ఉత్తమ్ దేవాదుల నుంచి నీళ్లు ఇస్తామంటూ కొత్త పాట అందుకున్నారని, దేవాదుల నీళ్లు ఇస్తామన్న ప్రాంతానికే ఇప్పటివరకు ఇవ్వలేదని, ఎస్ఆర్ఎస్‌పి 40 ఏళ్లు గడిచినా మొత్తం ఆయకట్టుకు ఇప్పటి వరకు నీళ్లు ఇవ్వలేదని, దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీళ్లు తెస్తామనేది మోసం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌ను ప్రారంభించి ఈ ప్రాంత రైతాంగానికి నీరు ఇవ్వాలని, కాళేశ్వరంపై కాంగ్రెస్ చెప్పిందంతా అబద్ధమని రుజువైందని అన్నారు. నందిమేడారం పంపు ఆన్ చేస్తే మిడ్ మానేరుకు నీళ్లొచ్చాయని, అలాగే మిగతా పంపులు ఆన్ చేస్తే సూర్యాపేటకు కూడా నీళ్లు వస్తాయని అన్నారు. నాలుగేళ్లుగా సూర్యాపేటకు వచ్చింది కాళేశ్వరం జలాలే అని, ఇప్పుడొచ్చే నీళ్లకు ఏ పేరు పెట్టిన పర్వాలేదన్నారు. ఎట్టిపరిస్థితుల్లో బనకచర్లను వ్యతిరేకించాలని, ఇప్పుడున్న నీళ్ల మీద ప్రాజెక్టు కట్టడానికి వీలు లేదన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# అప్పుడు ట్రంప్ ఉంటే యుద్ధం జరిగేది కాదు: పుతిన్




అలాస్కా:
ఉక్రెయిన్ యుద్ధంపై చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అలాస్కాలో జరిగి సమావేశం ముగిసింది. అలాస్కాలో రెడ్ కార్పెట్ లో పుతిన్ అమెరికా అధ్యకుడు ట్రంప్ ఘన స్వాగతం పలికారు. పుతిన్ ట్రంప్ వైపు నడుస్తూ రాగానే అమెరికా అధ్యక్షుడు ఆయనకు మూడుసార్లు చప్పట్లు కొట్టి స్వాగతం పలకడంతో షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఇద్దరు స్నేహభావంతో నవ్వులతో ఒకరిని ఒకరు పలకరించుకున్నారు. ఈ సమావేశం ముగిసిన తరువాత పుతిన్ మీడియాతో మాట్లాడారు. 2022లో ట్రంప్ అమెరికా అధ్యక్షుడి ఉండి ఉంటే ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం జరిగి ఉండేది కాదన్నారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ముగించేందుకు ఆసక్తి చూపిస్తున్నానని, కానీ ఈ సంక్షోభానికి కారణమైన మూల అంశాలను పరిష్కరించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ డిమాండ్ చేశారు. ఉక్రెయిన్ కు భద్రత కల్పించాలన్న ట్రంప్ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని ఆయన చెప్పారు. అలాస్కా శిఖరాగ్ర సమావేశం తరువాత రెండో భేటీ మాస్కోలో జరిగే అవకాశముందని తెలియజేశారు. ఇద్దరు నేతలు మీడియా ప్రశ్నలకు స్పందించకుండా గదిని విడిచే ముందు, రెండో సమావేశం ఎప్పుడు జరుగుతుందనేది అధికారికంగా ప్రకటించలేదు. గతంలో రష్యా అమెరికా దేశాల మధ్య చాలా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నాయని, ప్రస్తుతం ఇరు దేశాలు మంచి సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, యూరోప్ నేతలతో మాట్లాడిన తరువాత పుతిన్ తో మళ్లీ చర్చలు జరుపుతానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు.

# పాకిస్థాన్‌లో వరదలు.. 320 మంది మృతి

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ల్లోని పలు ప్రాంతాల్లో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా రెండు రోజుల్లోనే 321 మంది మరణించినట్టు అధికారులు వెల్లడించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోనే 307 మంది చనిపోయినట్టు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఖైబర్‌ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోని లోయర్ దిర్, బజౌర్, లబోటాబాద్,జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగి పడటంతో భారీ విధ్వంసం చోటు చేసుకుంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టుకుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతు కాగా, వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు 2 వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. మరోవైపు పాక్ లోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్షముప్పు ఉన్నట్టు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

## నీటి నిర్వహణ పకడ్బందీగా ఉండాలి.....



**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**
**పాలేరు రిజర్వాయర్ ను పరిశీలించిన అదనపు కలెక్టర్**
**ప్రస్తుత నీటి నిల్వ, ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, తదితర అంశాలపై ఆరా**

ఖమ్మం, ఆగస్టు 16 ప్రజావేదిక బ్యూరో:
పాలేరు రిజర్వాయర్ లో నీటి నిర్వహణ పకడ్బందీగా ఉండాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.అదనపు కలెక్టర్ పాలేరు రిజర్వాయర్ ను శుక్రవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాలేరు రిజర్వాయర్ లో ఉన్న నీటి నిల్వ, ఇన్ ఫ్లో ఎంత, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం ఎంత, వంటి వివరాలను నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఆరా తీశారు.ప్రాజెక్టులో నీటి నిల్వ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద ఆధారంగా ఎప్పటికప్పుడు దిగువకు నీరు విడుదల చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ , పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.
ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్.ఈ. ఎం. వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



## శ్రీకృష్ణ,గోపిక వేషధారణలో సందడి చేసిన చిన్నారులు



అనంతగిరి ఆగస్టు 16
ప్రజా వేదిక ప్రతినిధి:
కృష్ణాష్టమి జన్మదిన వేడుకలను అనంతగిరి మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు.శ్రీకృష్ణుడు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పలు పాఠశాలలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.మండల పరిధిలోని పాలవరం గ్రామానికి చెందిన గుడిమెట్ల నివేద,నివాన్స్ శ్రీకృష్ణ,గోపిక కృష్ణుని వేషధారణలో అలరించారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు వీరి వేషాధారణతో ఆనందం వ్యక్తం చేసారు.ధర్మరక్షణలో శ్రీకృష్ణుడు సాధించిన విజయాలను ఉపాధ్యాయులు,విద్యార్థులకు వివరించారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణనష్టమి పరమాత్మకి పూజలు






**తిరుమలాయపాలెం ఆగస్టు 16 ప్రజా వేదిక ప్రతినిధి**
మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో ఆదివారం జరగబోయే శ్రీ కృష్ణ పరమాత్మ పల్లకి ఊరేగింపు సేవలో గ్రామస్థులు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి స్వామి వారి కృపకు పాత్రలు కాగలరు.
తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకను ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు త్రిమత ఏకైక గురువు ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తిశతాధిక గ్రంథకర్త ఇందు జ్ఞాన ధర్మప్రదాత సంచలనాత్మక రచయిత త్రైతసిద్ధాంత అధికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల వారి దివ్యమైన ఆశీస్సులతో శనివారం రోజున ఉదయం కృష్ణాష్టమికి సంబంధించిన పూజా కార్యక్రమం చేశారు అనంతరం వారు రేపు అనగా ఆదివారం రోజు ఊరేగింపు పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ అధ్యక్షులు సత్యం విజయ ఉపాధ్యక్షులు ఉమేష్ చందర్ సీపీఎం మండల నాయకులు కాంపాటి బాబురావు దంపతులకు నిర్వాహకులు చెన్న సుజాత,సాయి,దీక్షిత్ కమిటీ సభ్యులు.శ్రీనివాస్,మమత,కవితా,భవాని కల్పన.విజిత,శారద,వాణి,దివ్య,అలేఖ్య,పల్లవి,హర్షిత, వినురాధ, ఉదయశ్రీ భరత్ కుమార్,సూర్యతేజ,అఖిల్, అశ్విత్,ఆరోన్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాజ్‌పేయికి ఘనంగా నివాళి

**నేలకొండపల్లి ఆగస్టు 16 ప్రజా వేదిక బ్యూరో:**
భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో.. ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక, మాజీ ప్రధానమంత్రి, కవి, ప్రజానాయకుడు, భారత రత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి గారి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను స్మరించుకున్నా బిజెపి రాష్ట్ర నాయకులు శ్రీ దేవకి వాసుదేవ రావు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాజపేయి గారు రాజకీయ రంగంలో సాధించిన విజయాలు, దేశాభివృద్ధి కోసం తీసుకున్న కీలక నిర్ణయాలు, ముఖ్యంగా అణు పరీక్షలు, జాతీయ రహదారి ప్రాజెక్టులు, కాశ్మీర్ సమస్యపై శాంతి ప్రయత్నాలు దేశ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే మైలురాళ్లు అని అన్నారు.వాజ్‌పేయి, స్ఫూర్తి, వారు చూపిన మార్గంలో నడుస్తూ వారి ఆశయాలను సాధించడం మా లక్ష్యం. ఆయన కలల భారత్‌ను సాకారం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుంది” అని వాసుదేవ రావు, తెలిపారు.అనంతరం మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించితెలంగాణలో మార్పురాలే%ౌ% బతుకులు మారలే” నినాదంతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ 10 ఏళ్ల అరాచక పాలనకు కొనసాగింపుగా మారిందని విమర్శించారు.నెరవేర్చని హామీలు, అవినీతి



విధానాలు, అసమర్థ పాలన, పేదలు%-%అణగారిన వర్గాల పట్ల నిర్లక్ష్యం తెలంగాణలో కొనసాగుతుందని మండిపడ్డారు.గ్రామాభివృద్ధి కోసం చిత్తశుద్ధి, అంకితభావం ఉన్న నాయకులు అవసరమని, అలాంటి వారినే బీజేపీ ముందుకు తీసుకొస్తోందని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవికుమార్, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిల్లులపై రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు ఉండదు..సుప్రీంకు కేంద్రం లేఖ



హైదారాబాద్: చట్టసభల్లో ఆమోదింపబడిన బిల్లులు గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలని సుప్రీంకోర్టు గతంలో ధర్మాసనం ఆదేశించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన దగ్గరే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానానికి క్లారిటీ ఇచ్చింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది.
అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

ప్రజావేదిక
ఆదివారం
17 ఆగస్టు 2025

# చిరంజీవి బర్త్‌డేకు విశ్వంభర టీజర్ విడుదల

## ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులు




మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో విశ్వంభర భారీ బడ్జెట్ తో వస్తోంది. వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాను సోషియో ఫాంటసీ థ్రిల్లర్ గా తీసుకొస్తున్నారు. జెట్ స్పీడ్ తో షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కాబోతున్న ఈ సినిమా నుంచి భారీ అప్డేట్ రాబోతోంది. మూవీ టీజర్ ను ఇప్పటికే కట్ చేసినట్టు- తెలుస్తోంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్టు- తెలుస్తోంది. త్వరలోనే రిలీజ్ డేట్ ను ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఆర్ ఆర్ కూడా కంప్లీట్ అయిపోయిందంట. గతంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ పై కొన్ని విమర్శలు వచ్చాయి. వీఎఫ్ ఎక్స్ వీక్ గా ఉందనే ప్రచారం జరిగింది. అందుకే ఈసారి ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూస్తున్నారంట.

వశిష్ట అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే మెగా ఫ్యాన్స్ మెచ్చే విధంగా టీజర్‌ను కట్ చేయించినట్టు తెలుస్తోంది. చిరంజీవి కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష, అషికా రంగనాథ్ హీరోయిన్లుగా చేస్తున్నారు. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత కాలం నాటికి వెళ్లే సీన్స్ కూడా ఉంటయాంటున్నారు. వింటేజ్ చిరు లుక్ గురించి ఇప్పటికే చర్చ జరుగుతోంది. కాబట్టి చిరంజీవి లుక్ ఈ సినిమాలో మరింత ఇం-టె-స్ట్ ను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఈ టీజర్ తో మెగా ఫ్యాన్స్ ను సంతృప్తి పరిచేసి మూవీపై భారీగా అంచనాలు పెంచాలని చూస్తున్నారు. సెప్టెంబర్ లోనే మూవీ రిలీజ్ అవుతుందనే టాక్ మొన్నటి వరకు నడిచింది. కానీ ఇప్పుడు అక్టోబర్ కు షిఫ్ట్ అయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# పూజా హెగ్డేను వెంటాడుతున్న బ్యాడ్‌లక్

ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలిగిన పూజా హెగ్డే, ప్రస్తుతం సరైన హిట్ కోసం కష్టాలు పడుతున్నారు. 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆమె నటించిన చాలా సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. దీంతో ఆమెకు బ్యాడ్ లక్ వెంటాడుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి.అల వైకుంఠపురములో' తర్వాత పూజా నటించిన సినిమాలు వరుసగా నిరాశ పరిచాయి. అఖిల్‌తో చేసిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', ప్రభాస్‌తో చేసిన 'రాధే శ్యామ్', విజయ్‌తో చేసిన 'బీస్ట్', రామ్ చరణ్‌తో చేసిన 'ఆచార్య' సినిమాలు బాక్సాఫీస్ వద్ద చతికిలపడ్డాయి. తెలుగులోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఆమెకు కలిసి రాలేదు. 'సర్కస్' , దేవా, 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రాలు కూడా విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రతికూల స్పందన పొందాయి. అంతేకాకుండా, తమిళ నటుడు సూర్యతో చేసిన 'రెట్రో' కూడా నిరాశనే మిగిల్చింది. తాజాగా, ఆమె స్పెషల్ సాంగ్ చేసిన 'కూలీ' చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమాలో 'మోనికా' పాటలో ఆమె డ్యాన్స్ అందరినీ మెప్పించినప్పటికీ, సినిమాలో ఆ పాట ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు నిరాశపడ్డారు. దీనిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా జరిగింది. ఈ వరుస పరాజయాలు పూజా హెగ్డే కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తిరిగి ఫామ్‌లోకి రావడానికి ఆమెకు ఒక పెద్ద హిట్ ఎంత అవసరమో ఈ పరాజయాలు స్పష్టం చేస్తున్నాయి. ఆమె చేతిలో విజయ్ జన నాయగన్ సినిమా ఒక్కటే ఉంది. మరి భవిష్యత్తులో ఆమె లక్ ఎలా ఉంటుందో చూడాలి.



# రజనీ, అజిత్ ఆఫ్‌స్క్రీన్ గురించి పట్టించుకోరు: మాధవన్



విలక్షణ నటుడు ఆర్. మాధవన్ తన సినీ ప్రయాణం, వ్యక్తిగత సిద్ధాంతాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తన ఆఫ్‌స్క్రీన్ ఇమేజ్‌కు సంబంధించి సూపర్‌స్టార్ రజనీకాంత్, తన స్నేహితుడు అజిత్ కుమార్‌ల నుంచి ఎంతో స్ఫూర్తి పొందానని ఆయన వెల్లడించారు. నటనకు అవసరం లేనప్పుడు తాను జుట్టుకు రంగు వేసుకోనని, సహజంగా ఉండేందుకే ఇష్టపడతానని స్పష్టం చేశారు.ఓ తాజా ఇంటర్వ్యూలో మాధవన్ మాట్లాడుతూ, "రజనీకాంత్ గారు ఆఫ్‌స్క్రీన్‌లో చాలా సాధారణంగా ఉంటారు, కానీ తెరపై అద్భుతాలు చేస్తారు. నా స్నేహితుడు అజిత్ కూడా అంతే. వారిని చూసి నేను నేర్చుకున్నది ఏమిటంటే, మన ఆఫ్‌స్క్రీన్ ఇమేజ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను నాలా సౌకర్యంగా ఉంటాను," అని తెలిపారు. తనకు ఎవరితోనూ పోటీ లేదని, తన సామర్థ్యాలతో తనను తాను సవాలు చేసుకుంటూ ముందుకు వెళ్తానని ఆయన పేర్కొన్నారు.అవార్డుల గురించి ప్రస్తావిస్తూ, వాటి కంటే ప్రేక్షకుల అభిమానమే తనకు గొప్పదని మాధవన్ అన్నారు. "నలభై ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా అవార్డులు రాలేదని కొందరు అనొచ్చు. కానీ నాకు వాటితో పనిలేదు. చిత్ర పరిశ్రమలో నా కన్నా గొప్ప నటులు ఎందరో ఉన్నారు. వారికి కూడా సరైన గుర్తింపు దక్కలేదు. దిలీప్ కుమార్ లాంటి మహానటుడికే జాతీయ అవార్డు రాలేదు" అని గుర్తుచేశారు.ఇన్నేళ్ల కెరీర్‌లో తనకు మంచి పాత్రలు లభించడమే సంతోషాన్నిస్తుందని మాధవన్ తెలిపారు. ఇటీవల ఆయన నటించిన 'ఆప్ జైసా కోయి' చిత్రం విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో 40 ఏళ్ల పెళ్లికాని యువకుడి పాత్రలో ఆయన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి.

# బెంగాల్ ఫైల్స్ ట్రైలర్ విడుదల




ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి వివాదాస్పద చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ది బెంగాల్ ఫైల్స్. ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటు-లు కీలక పాత్రల్లో నటించారు.

# త్వరలో ఆఫ్రికాకు రాజమౌళి

## అక్కడే కీలక సన్నివేశాల చిత్రీకరన

మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్స్ వచ్చాయి. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి స్వయంగా ఈ సినిమా గురించి కొన్ని విషయాలు వెల్లడించారు. కేవలం కొన్ని ప్రెస్ మీట్‌లు లేదా అప్‌డేట్స్ ద్వారా సినిమా కథాంశాన్ని పూర్తిగా వివరించలేమని రాజమౌళి స్పష్టం చేశారు. సినిమా గురించి అప్పటికప్పుడు ఏది అప్‌డేట్ ఇవ్వాలో అదే ఇస్తామని తెలిపారు. దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన అల్లర్ల కారణంగా అక్కడ ప్లాన్ చేసిన షూటింగ్ వాయిదా పడింది. సెప్టెంబర్ రెండో వారంలో సౌత్ ఆఫ్రికాలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ ఆలస్యం కావడంతో, ఈ మధ్య హైదరాబాద్‌లోనే హీరోయిన్‌తో కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేశారు. ప్రస్తుతం షూటింగ్స్ నిలిచిపోయిన నేపథ్యంలో

# 'ఓజీ' నుంచి ప్రియాంక లుక్ విడుదల

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ఓజీ' నుంచి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను శనివారం చిత్ర బృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆమె 'కన్మణి' అనే పాత్రలో కనిపించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పోస్టర్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది.'రన్ రాజా రన్', 'సాహో' చిత్రాల ఫేమ్ సుజీత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను మునుపెన్నడూ చూడని శక్తివంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ 'ఓజాస్ గంభీర' అనే పాత్రలో నటిస్తుండగా, ఆయన సరసన ప్రియాంక అరుల్ మోహన్ నటిస్తున్నారు. తాజా పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. భారీ తారాగణంతో, ఉన్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

